స్మృతి రేఖలు

కుమారి సరస్వతీరావు

తెల్లవారబోతోంది. బద్ధకంగా కళ్ళునులుపుకొంటూ లేచాను. నెమ్మదిగా కిటికీ తలుపులు తెరిచాను. చలి ఎముకలు కొరికేస్తున్నట్లుగా వుంది. మంచు తెరల మధ్య నుండి ఎదురింటి మేడ అస్పష్టంగా కనిపిస్తోంది. అలాగే ఆ మేడ వైపు చూస్తూ నిలబడ్డాను ఐదునిముషాలలో మేడమీది కిటికీ తెరుచుకుంది. ఆమె అస్పష్టంగా కనిపిస్తోంది. కిటికీ మూసి దుప్పటి కప్పుకుని పడుకొన్నాను.

"మీవరస నాకేం నచ్చలేదు." అన్నది సుజాత.

"ఏ వరస?" అన్నాను.

"రోజూ గమనిస్తూనే వున్నాను. లేవగానే కిటికీ తీస్తారు. ఎదురింటి పిల్ల కిటికీ తీసేవరకూ అలాగే చూస్తారు. ఆ పిల్ల కిటికీ తీయగానే ఆ పిల్ల ముఖం చూసి కిటికీ మూసేసి పడుకొంటారు. ఎవరైనా చూస్తే ఏమనుకొంటారు? ఆ పిల్ల కూడా రోజూ ప్రొద్దుటే కొంప మునుకు పోతున్నట్లూ ఆ కిటికీ దగ్గరే నిలబడుతుందేం ఖర్మ." విసుక్కొంటూ అన్నది సుజాత.

"అనవసరంగా ఆ పిల్లనెందుకు ఆడి పోసుకొంటావు." అన్నాను. శ్రీమతి చుర చురా నావైపు చూసి వెళ్ళిపోయింది.

నేను ఆలోచనలలో మునిగి పోయాను. ఆ రోజులు ఎంతో మధురంగా గడిచిపోయాయి. డిగ్రీ పుచ్చుకొని ఉద్యోగంలో చేరిన కొత్త రోజులు. ఇంకా కుర్రతనం వీడని రోజులు. ఉద్యోగం చేస్తున్నా, స్టూడెంట్స్‌లాగానే ప్రవర్తిస్తూ వుండే వాళ్ళం. ఆఫీస్‌కి దగ్గరగా వుంటుందని మా బంధువుల యింట్లో— అంటే ఈ యిల్లే—అద్దెకు దిగాను. మేడమీద రెండుగదులు. చక్కగా విశాలంగా వున్నాయి. నేను ఈ భాగంలోకి వచ్చిన వారం రోజులకే మా ఫ్రెండ్ రవికూడా ఈ భాగంలోకే వచ్చిచేరాడు. ఇద్దరం చాలా సరదాగా హాయిగా రోజులు గడిపి వేస్తున్నాం.

ఆ రోజు నాకు బాగా గుర్తు, సాధారణంగా అలాంటి రోజులు ఎవరూ మరిచిపోరు. ప్రతి ఆదివారం నేనూ రవీ కలిసి సినిమాకి వెళ్ళేవాళ్ళం. ఆ ఆదివారం శ్రీ ఫోర్ట్వెంటీ సినిమాకి వెళ్ళాం. నర్గీస్ ఎంత బాగా యాక్ట్ చేసిందో, రాజకపూర్ ఆ సినిమాని ఎంత బాగా తీయగలిగాడో, శంకర్ జైకిషన్ ఎంత కష్టపడి అంత మంచి సంగీతాన్ని సమకూర్చారో నని— యివన్నీ మాట్లాడుతున్నాడు రవి సినిమానుండి రాగానే.

నాకు నిద్ర ముంచుకు వచ్చేస్తోంది. కన్నులు మూతలు పడిపోతున్నాయి.

"ఒరేయ్. పాటరా. లేవరా." నన్ను కుదుపుతూ లేపాడు రవి.

ఎదురింట్లో యెవరో హార్మోణి వాయిస్తున్నారు. దానికోసం మా వాడు నన్ను హడావిడిగా తట్టి లేపాడు.

"చార్ సౌ బీస్‌లో పాటరా" వుత్సాహంగా అన్నాడు.

"నన్ను లేపావంటే చంపేస్తాను. నిద్రపోనీ" అంటూ పడుకొన్నాను.

తెల్లవారుతూ వుండగా మెలకువ వచ్చింది. బయట వర్షంపడుతున్న చప్పుడవుతూవుంటే కిటికీ తలుపులు తీసి చూశాను. సరిగ్గా ఆ సమయానికే ఎదురింటి కిటికీ తలుపులుతెరుచుకొన్నాయి. ఆమె కిటికీ దగ్గర నిలబడి వుంది. ఆమె నావైపు చూడటంలేదు. నేను మాత్రం అలాగే ఆమెవైపే చూస్తున్నాను. ఆమె మంచి అందగత్తె. అపురూప సౌందర్యరాసి. అందాలభరిణ. ఆమె అందం ఎంతని చెప్పను? ఏమను చెప్పను? రెప్పవాల్చకుండా అలాగే చాలాసేపు చూశాను.

"ముఖం కడిగేవురా?" అరుస్తున్నాడు రవి.

"వస్తున్నా......" అంటూ కదిలాను.

నేను ముఖం కడుక్కుని వచ్చేసరికి ఎదురింటి కిటికీ తలుపులు మూసివున్నాయి. ఆ రోజుసాయంత్రము ఆఫీస్ నుండి రాగానే ఎదురింటి వైపు చూశాను. కిటికీ తలుపులు మూసేవున్నాయి.

మర్నాడు ప్రొద్దుట లేవగానే ఆ యింటివైపు చూశాను. ఆమె కిటికీ దగ్గర నిలబడివుంది. ఆమె ఒక్కసారైనా నావైపు చూడలేదు. రోజూ ఉదయం అలా చూస్తూనే వున్నాను.

నా విషయం మా రవిగాడికి కూడా తెలిసింది. "గట్టిగా చప్పట్లు కొట్టరా నీ ప్రేయసి యిటు చూస్తుందేమో" అంటూ జోక్స్ విసురుతూ వుండేవాడు. మరో రెండు వారాలు గడిచాయి. అలవాటు ప్రకారం కిటికీ దగ్గర నిలబడి చూస్తున్నాను. ఆమె ముఖం యిటు తిప్పింది. నా వైపే చూస్తోంది. ఆశ్చర్యపోయి అలాగే చూస్తూ వుండిపోయాను. ఎర్రగులాబీ మొగ్గలాగావున్న ఆమె పెదవులు మెల్లగా నవ్వాయి. వాటి మధ్య మల్లెలు వికసించి నట్లయింది. వెంటనే కిటికీ మూసికొంది. షాక్ తగిలినట్లయింది. ఈ విషయం మా రవిగాడితో చెప్పేను. నన్ను అభినందించాడు.

రోజులు సరదాగా గడుస్తున్నాయి. ఆమె ప్రతి రోజూ కాకపోయినా అప్పుడప్పుడూ నన్ను చూసి నవ్వుతోంది.

"మారేజి పార్టీ ఎప్పుడోయ్" అన్నాడు రవి.

"ఆమె అభిప్రాయం కనుక్కోందే......" అంటూ నసిగాను.

ఆ రోజు సాయంత్రం నేను ఆఫీస్ నుండి వచ్చేసరికి మా రవి ఒక చిన్న పిల్లని గదిలో కూర్చోబెట్టుకుని కబుర్లు చెప్తున్నాడు.

"ఎవ్వరాపిల్ల" అన్నాను.

"నీ మరదలు" అన్నాడు.

ముందు తెల్లబోయాను. తర్వాత అర్థంఅయింది. "నీకు ఎంతమంది అక్కయ్య లున్నారు" అన్నాను.

"ఒకే ఒక అక్కయ్య" ముద్దుగా మాట్లాడుతోంది ఆ పిల్ల.

"నీపేరు" బుగ్గమీద చిటికె వేస్తూ అన్నాను.

"అరుణ" అన్నది.

"మీ అక్కయ్య ఎంతవరకూ చదువుకొంది." అన్నాను.

"మా అక్కయ్యకి చదువు రాదు. నాకేవచ్చు. నాకు చదువు బాగా వచ్చు. నేను మూడో క్లాసు చదువుతున్నా తెలుసా?" గర్వంగా చెప్పింది అరుణ.

“మరి మీ అక్కయ్యకి చదువు రాదుగా. మరి పాట వచ్చా.” నవ్వుతూ అన్నాను.

“వూ.హూ. అక్కయ్యకి సంగీతం వచ్చు. బాగా పాడుతుంది. పెట్టె వాయిస్తుంది.” కళ్లు తిప్పుతూ చెప్తోంది అరుణ.

“పెట్టేమిటి?” ఆశ్చర్యపోతూ అన్నాడు రవి.

“పెట్టె తెలియదూ పెట్టె. యిలా వాయిస్తారూ......” సైగ చేస్తూ అన్నది అరుణ.

“వో...... హార్మణా” అంటూ నవ్వాడు రవి.

“ఆ..... అదే.....” అన్నది అరుణ.

“మీ అక్కయ్య పేరేమిటి?” అన్నాను.

“అరుంధతి.....”

ఆ రోజు రవి నాకో ప్లాన్ చెప్పాడు. నా కిష్టమైన పాట పాడమని నేను అరుణతో అరుంధతికి కబురు చేయటం. అరుంధతి ఆ పాట పాడుతుందో లేదో చూడాలి. అరుంధతి నేను కోరుకొన్న పాట పాడితే ఆమెకి నేనంటే యిష్టం వున్నట్లే......

“మీ అక్కయ్యకి రార వేణూ గోపాలా పాటవచ్చా.” అరుణని అడిగాను.

“వో...... నాకూ వచ్చు. రా....... ర..... వే...... ణూ.......” అంటూ అందుకొంది అరుణ.

“నీకు కాదమ్మా. మీ అక్కయ్యకి వచ్చా.....”

“అక్కయ్యకంటే నాకే బాగా వచ్చు. పాడనా... రా........ ర........”

“అరుణా ఆపమ్మా. మా అమ్మకదూ......”

“వూఁ. నేను పాడతాను....” రాగం అందుకొంది అరుణ.

“సరేపాడు.....” అన్నాను.

తనకి వచ్చినంతవరకూ పాడింది అరుణ.

“ఇంట్లోకి వెళ్ళగానే మీ అక్కయ్యని ఈ పాట పాడమను. నువ్వు బాగా పాడావో, మీ అక్కయ్య బాగా పాడిందో తెలుస్తుంది. చెప్తావా......” అన్నాను.

“వో........”

“ఎవరు పాడమన్నారని చెప్తావు.” అన్నాడు రవి.

“ఈయన.....” నన్ను చూపిస్తూ అన్నది అరుణ.

“ఆయన పేరు నీకు తెలియదుగా.” అన్నాడు.

“ఎదురింట్లో తెల్ల చొక్కా కాలేజి అబ్బాయి పాడమన్నాడని చెప్తాను.” అని అన్నది.

“గట్టిపిండమే” అనుకొన్నాను.

“కాలేజీ అబ్బాయి కాదు. ఆఫీసులో పనిచేసే అబ్బాయని చెప్పు.” అన్నాడు రవి.

అరుణ పరిగెత్తుకొంటూ వెళ్ళిపోయింది.

“ఆపిల్ల ఎలా తెలుసురా.....” అన్నాను.

“నేను ఆఫీసునుండి వస్తూవుంటే, అరుణ స్కూల్ నుండి వస్తోంది. మీ అమ్మతో చెప్పి మా యింటికిరా చాకలెట్లిస్తానని చెప్పాను. లోపలికి వెళ్లి ఐదు నిమిషాలలో వచ్చేసింది.” అన్నాడు రవి.

పావుగంట తర్వాత హార్మణి వాయిస్తూ ‘రా..... ర...... వేణూ........’ పాట వినపడింది. మా రవి సంతోషంతో చప్పట్లు చరిచాడు.

మర్నాడు ప్రొద్దుట ఆమె నన్ను చూసి నవ్వింది. నావైపు చాలాసేపు చూసింది.

రోజులు హాయిగా దొర్లిపోతున్నాయి. నేను పాడమని అడిగిన ప్రతిపాటా పాడుతోంది అరుంధతి.

“మీ అక్కయ్యకి పెళ్లి చేయాలను కొంటున్నారా?” ఒక రోజు అరుణని అడిగాను.

“నాకు తెలియదు. నేను పెద్దయ్యాక పెళ్లి చేసుకొంటాను.” అన్నది.

“పోనీ యిప్పుడే చేసుకో.” అన్నాను.

“ఛీ.... నీకు తెలియదూ. చిన్నప్పుడు పెళ్లి చేయరు.” నవ్వుతూ అన్నది అరుణ.

“ఇంటికి వెళ్ళగానే మీ అక్కయ్యని సినిమాలో నర్గీస్ పాడినపాట పాడమను.” అన్నాను.

“ఏ సినిమాలో......” అన్నది అరుణ.

“మీ అక్కయ్యకి తెలుస్తుందిలే. మీ అమ్మా, నాన్నా ఎవరూ చూడకుండా అడుగు.” అన్నాను.

“ఏం పరవాలేదు. రోజు అమ్మా, నాన్నా ఎదురుగానే చెప్తున్నాను. మొన్న అక్కయ్య పాడనంటే నాన్న కోప్పడి పాడించారు.”

నాతల గిర్రున తిరిగిపోయింది.

“నిజంగానా?”

“నిజమే. మా నాన్న ఏమీ అనరు. మీరు ఏపాట పాడమన్నా అక్కయ్యచేత పాడిస్తారు.” అన్నది అరుణ.

అరుణని పంపించి వూహాలోకంలో తేలిపోతూ ఆలోచిస్తున్నాను. ఆ రోజు రాత్రి మా రవి ఎదురింటి వాళ్ల న్యూస్ కొంత సేకరించాడు. ఆయన మంచి ఆఫీసరు. ఇద్దరే కూతుళ్లు. తెలుగువాళ్లే కానీ మా కులంకాదు. అయినా తెగించాను. అరుంధతి మీద నమ్మకం వుంది. మర్నాడు నాన్న వుత్తరం రాశారు. పెళ్లి చూపులకి రమ్మని. ఆ వుత్తరం చదివి అవతల పడేశాను. సాయంత్రం నీటుగా తయారై ఎదురింటికి వెళ్లాను. ఆయన నన్ను ఎంతో గౌరవంగా పలకరించారు.

ఇల్లంతా చూపించారు. మేడ చాలా బాగుంది. పై భాగంలో వాళ్ళుంటున్నారు. క్రింద ఏదో ఆఫీస్ వుంది.

“మా అమ్మాయి అరుంధతి” పరిచయం చేశారు.

“నమస్తే........” అన్నది అరుంధతి సూటిగా నావైపు చూస్తూ.

“ఎంత ధైర్యం” అనుకొన్నాను, ప్రతి నమస్కారం చేస్తూ.

“మీ పాటలు చాలా బాగుంటాయి” అన్నాను.

“ఏం బాగులే నాయనా. దాని దురదృష్టం అలా వుంది. ఎంత సంగీతం వస్తే ఏం లాభం. వో అయ్య చేతిలో పెట్టి భారం వదుల్చుకొనే ఆశ లేదుకదా. చూస్తూ చూస్తూ గుడ్డిదానిని ఎవరు కట్టుకొంటారు.” అన్నా రాయన.

నా చెవులని నేనే నమ్మలేకపోయాను. అరుంధతి వైపు చూశాను. ఆమె నావైపే చూస్తోంది. కళ్ళల్లో నీళ్ళు తిరిగి వున్నాయి.

“వస్తానండీ.......” అంటూ వచ్చేశాను. ఆయన పిలుస్తున్నా వినిపించుకోకుండా.

“ఆఫీసుకి టైం అవుతోంది లేవండి” శ్రీమతి అరుస్తోంది.

బద్ధకంగా లేచాను.

“ఇంకా ఆ పిల్ల గురించి ఆలోచిస్తున్నారా?” నవ్వుతూ అన్నది సుజాత.

అరుంధతి కథంతా శ్రీమతికి చెప్పేశాను.

“అరుంధతికి కళ్లు లేవని తెలియగానే పెళ్ళి చూపులకి పారిపోయారా” నవ్వుతూ అన్నది శ్రీమతి.

నేను సుజాతతో ఆ తర్వాత ఏం జరిగిందో చెప్పబోతున్నాను. పక్కింటావిడ పిలిస్తే వెళ్ళింది సుజాత.

మరోవారం తర్వాత మామూలుగా ప్రొద్దుటే లేచి ఆమె వైపు చూస్తున్నాను.

“ఆమె పేరు అరుంధతి కాదు రాధిక. నాతో అరుంధతని చెప్పారే.” అన్నది శ్రీమతి కోపంగా.

“అవును. ఈ పిల్లపేరు అరుంధతి కాదు. అరుంధతికి ఆపరేషన్ చేయిస్తే కళ్ళు వస్తాయన్నారు. రెండేళ్లు ఆగాను. ఆపరేషన్ జరిగింది కానీ కళ్ళు రాలేదు. పైగా అరుంధతికి అప్పటికే టి. బి. ముదిరి పోయింది. అందుకే ఆమెని వదులుకున్నాను. అరుంధతి వాళ్ళ నాన్నగారికి, ఫారిన్‌లో ఏదో మంచి జాబ్ వస్తే వెళ్లిపోయారు. ఆయన వెళ్ళిపోయిన తర్వాతనే మన పెళ్ళి స్థిరపడటం జరిగింది.” అన్నాను.

“అరుంధతి రోజూ మిమ్మల్ని చూసి నవ్వేది అన్నారు.....” నెమ్మదిగా అన్నది శ్రీమతి.

“అని అనుకొన్నాను. అరుంధతికి ఆ రోజులలో ప్రకృతి వైద్యం మొదలు పెట్టారు. ఉదయపు సూర్య కిరణాలు కళ్ళమీద పడాలని అలా నిలబడేది.” అంటూ నిట్టూర్చేను. “ఈ పిల్ల ... అంటే రాధిక. గుడ్డి పిల్ల కాదుకదా” అన్నాను భయంగా.

“కాదు. మూగది” విషాదంగా అన్నది శ్రీమతి.